హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.145	212	242
నల్లగొండ	రూ.146	210	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.8 | కనిష్ఠం 24.4

సూరీడు లెక్క..
మండలానికి ఓ తీరు



ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వేసవిలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మండలాలు, ప్రాంతాల మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. ఒక్కో ప్రాంతంలో ఎండ తీవ్రంగా ఉండటం, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉండటం, ఇంకొన్ని ప్రాంతాల్లో భానుడి ప్రచండం ఉంటోంది. గత ఏడాదికి భిన్నంగా ఈ ఏడాది ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. దీనికి తోడు గత ఏడాది వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో భూమిలో తేమశాతం పూర్తిగా పడిపోయింది. భూగర్భ జలాలు అడుగంటడం కూడా సమస్యగా మారింది. భూమిలో వేడి వాతావరణం అధికంగా ఉండటం వల్ల వాతావరణంలో సైతం కనీవినీ ఎరుగని రీతిలో తేడాలు కనిపిస్తున్నాయి.
- నల్లగొండ

ప్రాంతాల వారీగా గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం
ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లతో ఉష్ణోగ్రతల గణన
జిల్లా స్థాయి సగటు ఉష్ణోగ్రత లెక్కింపు టీఎస్‌డీపీఎస్‌లో

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొన్ని వారాలుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 43డిగ్రీలకు పైగా దాటిన మండలాలు, ప్రాంతాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం శరీరంపై చూపుతోంది. ప్రధానంగా శిశువులు, చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా అనారోగ్యం పాలవుతున్నారు. భూతాపం ప్రభావంతో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయే తప్ప తగ్గే అవకాశాలు లేవని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లలో గణన

వేసవి ఉష్ణోగ్రతలను అధికార యంత్రాంగం ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా గణిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 120కి పైగా ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్క నల్లగొండ జిల్లాలో 58కి పైగా ఈ స్టేషన్లు ఉన్నాయి. వీటి ద్వారా వాతావరణంలోని ఉష్ణోగ్రతలను లెక్కిస్తారు. ఒక్క మండలంలోని మూడు గ్రామాల్లో ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుని ఆ మండలం సగటును లెక్కిస్తారు. నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లలో మండలాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతల ఆధారంగా రాష్ట్ర స్థాయిలోని రాష్ట్ర డెవలప్‌మెంట్ ప్లానింగ్ (టీఎస్‌డీపీఎస్) ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లలో జిల్లాల వారీగా సగటు ఉష్ణోగ్రతను గణిస్తుంది. 45డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైతే వార్నింగ్‌గా గుర్తిస్తుంటారు. 40-45 డిగ్రీల ఉష్ణోగ్రతను అలర్ట్‌గా, 35-40 డిగ్రీల ఉష్ణోగ్రతను వాచ్‌గా, 35డిగ్రీల ఉష్ణోగ్రతను నో వార్నింగ్‌గా గుర్తిస్తారు. నల్లగొండ జిల్లాలో శుక్రవారం నాంపల్లి మండలంలో 43.0 డిగ్రీలు, మాడ్గులపల్లిలో 42.7డిగ్రీలు, చందంపేటలో 42.6డిగ్రీలు, నిడమనూరులో 42.6డిగ్రీల ఉష్ణోగత నమోదైంది. జిల్లా సగటు ఉష్ణోగ్రతను 39.8డిగ్రీలుగా గణించారు. ఉమ్మడి జిల్లాలో డ్రై ఏరియాతో మెట్ట ప్రాంతాలు, ఆయకట్టు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి.

మరో రెండు నెలలకు పైగా ఎండలే

సూర్యుడి భగభగలతో ఉమ్మడి జిల్లా వేడెక్కుతోంది. గత 10 రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు ప్రాంతాల వారీగా నమోదవుతున్నాయి. ఏ ప్రాంతంలో ఏ మండలంలో ఏ రోజు అధిక ఉష్ణోగ్రత ఉంటుందో తెలియని పరిస్థితి ఉంది. వర్షాలు, పచ్చదనం లేకపోవడం, చెట్లు తగ్గిపోవడం సైతం వాతావరణంలో మార్పుకు కారణమైంది. మరో రెండు నెలల కు పైగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలతో పాటు జూన్‌లో మృగశిర కార్తె ప్రారంభమయ్యే వరకు ఎండల తీవ్రత ఇదేవిధంగా ఉండనుంది. ఏప్రిల్, మేలో అకాల వర్షాలు వస్తే తప్ప ఉష్ణోగ్రతలు తగ్గేలా లేవు.

స్టేషన్ల వారీగా ఉష్ణోగ్రతల నమోదు

ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లలో మండలాల వారీగా ఉష్ణోగ్రతలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. జిల్లా సగటు ఉష్ణోగ్రత మాత్రం రాష్ట్ర స్థాయిలో టీఎస్‌డీపీఎస్ గణిస్తుంది. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఎంత ఉన్నాయో తెలుస్తుంది. మండలాలు, ప్రాంతాల్లో ఆయా వాతావరణానికి తగిన విధంగా ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి.
- నిరంజన్‌రావు, నల్లగొండ సీపీవో

'ఫ్రై'డే



- భానుడి ప్రతాపంతో జనం బెంబేలు
- నాంపల్లిలో 43డిగ్రీల ఉష్ణోగ్రత

నల్లగొండ, మార్చి 29: భానుడు శుక్రవారం ప్రతాపం చూపాడు. అత్యధికంగా నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో 43.0 డిగ్రీలు, అత్యల్పంగా శాలిగౌరారం మండలంలో 37.5 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాలలో అత్యధికంగా 42.6, ఆలేరు మండలం శారాజీపేటలో అత్యల్పంగా 37.3 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో అత్యధికంగా 42.2 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తి మండలంలో 36.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉష్ణోగ్రతకు తోడు ఉక్కపోతతో వృద్ధులు విలవిల్లాడుతున్నారు. దీంతో ప్రజలు శీతలపానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇళ్లలో వేడికి తట్టుకోలేక, బయటకు వెళ్లే పరిస్థితి లేక సామాన్య ప్రజలు ఇంట్లోనే ఉడికిపోతున్నారు. ఎండ తీవ్రతతో ఉదయం 11 నుంచే రహదారులపై వాహనదారులు కన్పించడంలేదు. తిరిగి సాయంత్రం ఆరు గంటల వరకు రోడ్లు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఆరు తరువాతే ప్రజలు బయటికి వస్తున్నారు. రాత్రి సమయాల్లో మాత్రమే ప్రజలు కొంత సేదతీరుతున్నారు.

శిథిలమవుతున్న డబుల్ ఇళ్లు



నల్లగొండలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేపదే ఊదరగొట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు అందని ద్రాక్షగానే మిగిలింది. ఇళ్లులేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని ప్రకటించిన అప్పటి ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఆ లక్ష్యాన్ని చేరలేకపోయింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 20వేల ఇళ్ల వరకు మంజూరుచేసినా, నిర్మాణాలకు వచ్చేసరికి కేవలం 6,360 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. అందులో లబ్ధిదారులకు కేవలం 1,644 ఇళ్లు మాత్రమే పంపిణీచేశారు. మరో 4,716 ఇళ్ల నిర్మాణం పూర్తయినా పేదలకు పట్టాలివ్వకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఎంతో విలువైన ఇళ్లను ఈ ప్రభుత్వమైనా పంపిణీ చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో దుస్థితి
- గత ప్రభుత్వం కట్టివదిలేయడంతో ఈ పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో అందుబాటులో 4,716 ఇళ్లు
- పదేళ్లలో మొత్తం ఇచ్చిన ఇళ్లు 1,644 మాత్రమే

నల్లగొండ నియోజకవర్గంలో 710 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, ఒక్క ఇంటిని కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో మునిసిపాలిటీ శివారులోని 550 ఇళ్లు, అన్నారెడ్డిగూడెంలో 75, పానుగోడులోని 75 ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి.

- దేవరకొండ నియోజకవర్గంలో మొత్తం 726 ఇళ్లు నిర్మించగా, పట్టణ శివారు పెంచికల్‌పాడు వద్ద నిర్మించిన 544 ఇళ్లలో 484 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. భీమనపల్లికి చెందిన 60 మందికి ఇళ్లు కేటాయించినా వాటికి పట్టాలివ్వకపోవడంతో లబ్ధిదారులు నిత్యం పట్టాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అయితే ఈ లేఅవుట్‌లో విద్యుత్, తాగునీటి వసతులు లేకపోవడంతో ఇళ్లలో నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది. కొండమల్లేపల్లిలో 30, కందుకూరులో మరో 30మందికి ఇళ్లు అందజేశారు. చందంపేటలో 100 మందికి పంపిణీ చేశారు. సంఖ్యాతండాలో 22 మందికి అందజేసినా వసతుల్లేక లబ్ధిదారులు ఇళ్లలో ఉండడం లేదు.
- మిర్యాలగూడ నియోజకవర్గంలో 660 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, మొలకపట్నంలో మాత్రమే 20ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. మునిపిసాలిటీ పరిధిలోని 560 ఇళ్లు, ఉల్సాయిపాలెంలో 20, ఆలగడపలో 20, కొత్తగూడెంలో 20, లావూడితండాలో 20 ఇళ్లు పేదలకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇళ్లను నిర్మించి వదిలేయడంతో కంపచెట్లు మొలిచి నిర్మాణాలు ధ్వంసమవుతున్నాయి.
- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కేవలం 80 ఇళ్లనే నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన చోట్ల మొండిచేయి మిగిలింది.
- సూర్యాపేట నియోజకవర్గంలో 1,418 ఇళ్లకు ఒక్క ఇంటిని కూడా లబ్ధిదారులకు ఇవ్వలేకపోయారు. ఈ నియోజకవర్గంలో పెన్‌పహాడ్ మండలంలో 253 ఇళ్లు, సూర్యాపేట మండల పరిధిలో నిర్మించిన 800 ఇళ్లకు ఆరునెలల క్రితం డ్రా తీసినా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. గాంధీనగర్‌లోని 50 ఇళ్లను సమీప కూలీలు ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారు. చివ్వెంల మండలంలో 60 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఆత్మకూరులో నిర్మించిన 60ఇళ్లను కృష్ణ సముద్రానికి చెందినవారు ఆక్రమించుకున్నారు. ఏపూరులో 70 ఇళ్లకు డ్రాతీసినా కేటాయించలేదు.
- కోదాడ నియోజకవర్గంలో 740 ఇళ్లకు బాలాజీనగర్‌లో నిర్మించిన 560ఇళ్లకు లాటరీలో లబ్ధిదారులను ఎంపికచేసినా వాటిని పంపిణీ చేయలేదు. బేతవోలులో 60 ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. కరివిరాల, రాంచంద్రాపురం, సిరిపురం గ్రామాల్లో 120 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. సిరిపురంలో వసతులు లేకపోవడంతో అన్ని ఇళ్లల్లో లబ్ధిదారులు నివాసం ఉండడం లేదు.
- తుంగతుర్తి నియోజకవర్గంలో 264 ఇళ్లను నిర్మించగా, 53 ఇళ్లను లబ్ధిదారులుకు అందజేయగా, 211 ఇళ్లు ఇవ్వాల్సి ఉంది. మద్దిరాల, గోరంట్ల, శిల్పకుంట్ల, డీకొత్తపల్లి, బైరవునిబండ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వలేదు. మిగిలిన గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా నిర్మాణంతో నిలిచిపోయాయి.
- ఆలేరు నియోజకవర్గంలో 377 ఇళ్లు నిర్మించగా, 375 లబ్ధిదారులకు అందజేశారు.
- భువనగిరి నియోజకవర్గంలో 641 ఇళ్లు నిర్మించగా, పోచంపల్లిలో 156 ఇళ్లు, భువనగిరిలో 444 ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉంది.
- నకిరేకల్ నియోజకవర్గంలో 606 ఇళ్లు నిర్మించగా, నార్కట్‌పల్లి మండలం నక్కలపల్లిలో 72 మాత్రమే లబ్ధిదారులకు ఇవ్వగా, ఇంకా 534 ఇళ్లు కేటాయించాల్సి ఉంది. ఇవి చిట్యాల, కట్టంగూరు, నార్కెట్‌పల్లి మండలాల్లో ఉన్నాయి.
- మునుగోడు నియోజకవర్గంలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో 74 ఇళ్లు, సంస్థాన్‌నారాయణపూర్ మండలం సర్వేల్‌లో 64 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు.
- నాగార్జునసాగర్ నియోజకవర్గంలో లబ్ధిదారులను ఎంపిచేశారే తప్ప ఇళ్లను నేటికీ నిర్మించలేదు.

నియోజకవర్గం	నిర్మించిన ఇళ్లు	లబ్ధిదారులకు ఇచ్చినవి	లబ్ధిదారులకు ఇవ్వాల్సినవి
నల్లగొండ	710	-	710
దేవరకొండ	726	666	60
నాగార్జునసాగర్	-	-	-
మిర్యాలగూడ	660	20	640
హుజూర్‌నగర్	80	80	-
కోదాడ	740	180	560
సూర్యాపేట	1,418	60	1,358
తుంగతుర్తి	264	53	211
నకిరేకల్	606	72	534
మునుగోడు	138	138	-
భువనగిరి	641	-	641
ఆలేరు	377	375	2
మొత్తం	6,360	1,644	4,716



నేటి నుంచి కాంగ్రెస్ ప్రచారం

- మట్టపల్లిలో పూజల అనంతరం ప్రారంభం
- మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సన్నాహక సమావేశం
- రానున్న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి
- హాజరుకానున్న మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల



మట్టపల్లిలో సన్నాహక సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సమాయత్తమైంది. ఉమ్మడి జిల్లాలో నల్లగొండ స్థానానికి కుందూరు రఘువీర్‌రెడ్డిని, భువనగిరికి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఇప్పటికే అభ్యర్థులుగా ఖరారయ్యారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ప్రచారాన్ని శనివారం హుజూర్‌నగర్ నియోజకవర్గం మట్టపల్లి నుంచి ఆ పార్టీ నేతలు ప్రారంభించనున్నారు. పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, లోక్‌సభ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఇతర ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఉదయం 10గంటలకు తొలుత మట్టపల్లి లక్ష్మీనరసింహుడి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం మట్టపల్లిలోనే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం జరగనుంది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, ముఖ్యనాయకులందరూ ఈ సమావేశానికి రానుండడంతో మట్టపల్లిలో విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలవాలని

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గానికి చరిత్రలో ప్రత్యేక స్థానముంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలుపొందిన రావి నారాయణరెడ్డి దేశంలోనే అత్యధిక మెజార్టీ సాధించారు. ఆ గౌరవంతో పార్లమెంట్ భవనాన్ని ఆయనతోనే ప్రారంభించారని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు ఈసారి మళ్లీ ఆ స్థాయిలో దేశంలోనే అత్యధిక మెజార్టీతో నల్లగొండ ఎంపీగా రఘువీర్‌రెడ్డిని గెలిపిస్తామని చెబుతున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు 5లక్షల మెజార్టీ సాధించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు సీట్లలో ఆరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఇది పార్టీకి కలిసొచ్చే అంశమైతే, కీలకమైన ఇద్దరు మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి సొంత నియోజకవర్గాలు ఈ పార్లమెంట్ పరిధిలో ఉండటం పార్టీకి ప్లస్‌పాయింట్‌గా భావిస్తున్నారు. నేతల బలంతో పాటు తమ పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉందని, సామాన్య కార్యకర్త నుంచి మంత్రుల వరకు పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామని, ఆరు గ్యారంటీల అమలుతో ఇప్పటికే ప్రజల మనసులో సుస్థిర స్థానం ఏర్పడిందని, లోక్‌సభ ఎన్నికల్లో లక్ష్యాన్ని సాధిస్తామని నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కె.శంకర్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు.

సన్నాహక సభకు తరలిరావాలి : మంత్రి ఉత్తమ్

మఠంపల్లి: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంటు అభ్యర్థి దేశ చరిత్రలో అత్యధిక మెజార్టీతో గెలుస్తారని, మట్టపల్లిలో శనివారం నిర్వహించనున్న పార్టీ సన్నాహక సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మట్టపల్లిలో నిర్వహించనున్న నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశ ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. హెలీప్యాడ్, సభా ప్రాంగణం, ఎన్‌సీఎల్ గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, సన్నాహక సమావేశానికి ఏడు నియోజవర్గాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలన్నారు.

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కేసీఆర్ పర్యటన రేపు



ఎండిన పంట పొలాల పరిశీలన

నల్లగొండ, మార్చి 29: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 31న నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఎండిన పంట పొలాలను ఆయన పరిశీలించనున్నారు. ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి నీరు అందక ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించి రైతుల కష్టాలు తెలుసుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా కరువు కాటకాలతో పంటలు ఎండిపోతున్న విషయం తెలిసిందే. భూగర్భ జలాలు అడగండిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. దీంతో పంట పొలాలు నిలువునా ఎండుతున్నాయి. ఇప్పటి వరకు తెలిసిన సమాచారం మేరకు నల్లగొండ మండలం ముషంపల్లిలో కేసీఆర్ పర్యటించే అవకాశాలు ఉన్నాయి. దీనికి సంబంధించి పార్టీ నాయకులు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటిస్తుండడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 29: ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు అన్నారు. పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ పరీక్ష నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని, పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కపల్లి పెంటయ్య, నాయకులు ఇరుగు శ్రీరాములు, బిక్షపతి, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- టెట్ పరీక్షతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని బంజారా ఉద్యోగుల సంఘ స్టేట్ కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు అన్యాయం చేసేలా ఉన్న నూతన నిబంధనలు తొలగించాలని కోరారు. సమావేశంలో మక్లా, దేవి, కోట్యానాయక్, సైదా, పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే
కఠిన చర్యలు



ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ టౌన్, మార్చి 29: ప్రస్తుతం ఐపీఎల్ నడుస్తున్నందున చాలామంది యువకులు ఈజీగా డబ్బు సంపాదించడం కోసం క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ చందనాదీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌తో ఆర్థికంగా దెబ్బతిని ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, కాబట్టి యువత వీటికి దూరంగా ఉండాలని కోరారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వినోదం కోసం ఆడే ఆటను వినోదంగానే చూడాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100 గానీ, సమీప పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

కేసీఆర్‌పై కోపంతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ఎండిన పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

తుంగతుర్తి, మార్చి 29: కేసీఆర్ మీద కోపంతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెలుగుపల్లి, మొండికుంటతండాలో ఎండిన పొలాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పక్క గోదావరి నీళ్లు పోతున్నా పట్టించుకోకుండా రైతాంగాన్ని నాటు వేసుకోమని చెప్పి పంటలను ప్రభుత్వం ఎండబెడుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు ఎత్తిపోసి సుమారు 50 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకుని నిల్వ చేసుకునే శక్తి ఉన్నప్పటికీ మేడిగడ్డ పియర్లు, ప్రాజెక్టు కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, కేసీఆర్‌ను బదనాం చేయడానికే నీళ్లు లేవని సాకు చెబుతూ రైతుల పంటలను ఎండపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ చిత్తశుద్ధి లేకనే నీరు రావడం లేదన్నారు. కేంద్రంలోని మోదీ, ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు చేస్తున్నాడని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులకు కష్టాలు లేకుండా పాడి పంటలతో రెండు పంటలకు నీళ్లు, రైతుబంధు, బీమా అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. గత వేసవిలో కూడా చెరువులు అలుగు పోశాయని, నేడు చెరువులు ఎండిపోయే దశకు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయినప్పటికీ రైతు రుణమాఫీ, రైతు భరోసా, క్వింటాకు రూ.500బోనస్, రైతుబంధు ఇప్పటికీ చాలా మందికి అందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న మాటలు నీటిమూటలయ్యాయన్నారు. ప్రభుత్వం ఎండిన పంటలకు రూ.25వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్ఏ రజాక్, తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, గుడిపాటి సైదులు, మట్టిపల్లి శ్రీశైలం, రవీందర్‌రెడ్డి, మొరిశెట్టి ఉపేందర్, ఉప్పలయ్య పాల్గొన్నారు.



లక్ష్మీనృసింహుడికి సువర్ణ పుష్పార్చన

•7లో..

నేటి నుంచి జాతీయస్థాయి
నాటకోత్సవాలు

మిర్యాలగూడ టౌన్, మార్చి 29: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక కళాకేంద్ర సంయుక్తంగా పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో జాతీయస్థాయి నంది నాటకోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాల్లో పద్య, సాంఘిక విభాగాల్లో పోటీలు ఉంటాయని కళాకేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి తెలిపారు. ఈ పోటీలు ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగుతాయి.

స్టేషన్‌కు తరలించమంటే బోల్తా కొట్టించాడు

● ఇసుక ట్రాక్టర్‌ను పల్టీ కొట్టించిన డ్రైవర్.. ఆపై పరారీ ● సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్)లో ఘటన



డ్రైవర్ బోల్తా కొట్టించిన ఇసుక ట్రాక్టర్

ఆత్మకూర్ (ఎస్), మార్చి 29: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా తప్పించుకునేందుకు ఇసుక సహా ట్రాక్టర్‌ను డ్రైవర్ బోల్తా కొట్టించిన ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన జటంగి ముత్తయ్య ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా బోరింగ్‌తండా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించాలని డ్రైవర్‌ను ఆదేశించారు. ఇసుక కేసు నుంచి తప్పించుకోవాలనుకున్న డ్రైవర్ ముత్తయ్య ఆత్మకూర్ సమీపంలో ట్రాక్టర్‌ను చాకచక్యంగా బోల్తాకొట్టించి దూకేశాడు. ఇసుక నేలపాలు కావడమే కాకుండా ట్రాక్టర్ ధ్వంసమైంది. అయితే తప్పించుకునే ప్రయత్నం చేసిన డ్రైవర్ ముత్తయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే ట్రాక్టర్ గురువారం ఇసుక తరలిస్తుండగా నూతన్‌కల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఆత్మకూర్(ఎస్) పోలీసులు కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు పంపినట్లు ఎస్ సైదులు తెలిపారు.

జోరుగా ఇసుక దందా

మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. ఇసుక దందాను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ప్రతీరోజు నూతన్‌కల్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో పోలీసులు ఇసుక ట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తున్నా, కేసులను లెక్క చేయకుండా తిరిగి ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారులు ఈ ఇసుక దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.5.80లక్షల నగదు స్వాధీనం

ఆత్మకూరు(ఎస్), మిర్యాలగూడ, కోదాడ రూరల్, మార్చి 29: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.5.80లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్)- నెమ్మికల్ గ్రామాల ట్రాలీ ఆటోను తనిఖీ చేయగా, మద్రిపెడ బంగ్లా కు చెందిన బోయిని మల్లేష్ నుంచి రూ. 2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద హైదరాబాద్ వైపు వెళుతున్న కారులోని వ్యక్తి వద్ద రూ. 75వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడ హనుమాన్‌పేట ఫ్లైఓవర్ వద్ద కారులో తరలిస్తున్న రూ. 2.55లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

బంగారు పుస్తెలతాడు అపహరణ

మోత్కూరు, మార్చి 29: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వేసవి కావడంతో ఇంట్లో ఉక్కపోత భరించలేక గడ్డం యాదమ్మ అనే మహిళ గురువారం రాత్రి ఇంటి ముందు (ఆరుబయట) మంచంలో నిద్రించింది. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి నిద్రలో ఉన్న ఆమె మెడలోంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. ఆమె కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు వెతికినా ఎవరూ కన్పించలేదు. 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి గాలించినా దొంగ దొరకలేదు. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలంలో వివరాలు సేకరించారు.



నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలో ఎండలోనే ఉపాధి కూలీకి వెళుతున్న మహిళ

సూర్య ప్రతాపం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భానుడి భగభగలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచే వేసవి తాపం పెరుగుతుండడంతో వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉష్ణోగ్రతకు తోడు ఉక్కపోతతో వృద్ధులు విలవిల్లాడుతున్నారు. ఇళ్లలో వేడికి తట్టుకోలేక, బయటకు వెళ్లే పరిస్థితి లేక సామాన్య ప్రజలు ఇంట్లోనే ఉడికిపోతున్నారు. ఎండ తీవ్రతతో రహదారులపై వాహనదారులు కన్పించడంలేదు. తిరిగి సాయంత్రం ఆరు తర్వాత బయటకు వెళ్తున్నారు.

(స్టాఫ్ ఫొటోగ్రాఫర్-నల్లగొండ)



వేసవినుంచి ఉపశమనం కోసం చెట్ల నీడన పశువులు



నల్లగొండలో ఎండలోనే ఉపాధి పనులకు వెళుతున్న కూలీలు



నల్లగొండలో ఎండలోనే చిరువ్యాపారి బతుకు పోరాటం



వేసవినుంచి ఉపశమనం కోసం నల్లగొండలో ఈత కొడుతున్న యువకులు



నల్లగొండలో..

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉనికి లేదు

● దేశంలో కాంగ్రెస్ 50 సీట్లు కూడా గెలవదు ● నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి

దేవరకొండ, మార్చి 29: రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉనికి లేదని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండలో జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. నల్లగొండ జిల్లా సమస్యలను గత పార్లమెంట్ సభ్యులెవరూ పట్టించుకోలేదని, మోదీ మూడోసారి ప్రధాని అవుతారని, తనను పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపిస్తే జిల్లాను అభివృద్ధి చేస్తానన్నారు. దేశంలో కాంగ్రెస్ 50 సీట్లు కూడా గెలిచే పరిస్థితిలేదన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఏటి కృష్ణ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్, చనమోని రాములు, నరేందర్‌రెడ్డి, వస్కుల సుధాకర్, నక్క వెంకటేష్‌యాదవ్, గుండాల అంజయ్యయాదవ్, సాంబశివుడు, నర్సింహరావు, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సైదిరెడ్డి

కాంగ్రెస్‌పై ప్రజల్లో భ్రమలు తొలిగాయి

● వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు ఉత్తిదే ● నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 29: కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు వంద రోజుల్లోనే భ్రమలు తొలిగిపోయాయని నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు కాంగ్రెస్ భ్రమలు కల్పించిందన్నారు. మూడు నెలల్లోనే ఐదేళ్ల వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. కరువుతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహరెడ్డి, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

దూపహాడ్‌లో డెంగీ కేసు నమోదు

పెన్‌పహాడ్, మార్చి 29: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దూపహాడ్ గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. దూపహాడ్ గ్రామస్థులు జ్వరాలతో బాధపడుతుండటంతో శుక్రవారం పెన్‌పహాడ్ పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మాసంగి రాములు(72)కు సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించగా, డెంగీ జ్వరంగా నిర్ధారణ అయిందని పీహెచ్‌సీ హెచ్‌ఈవో చంద్రశేఖరరాజు తెలిపారు. దీంతో గ్రామంలోని అందరికీ పీహెచ్‌సీ సిబ్బంది జ్వరం నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, ఎవరికీ డెంగీగా నిర్ధారణ కాలేదు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి, మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, హెచ్‌ఈవో లు శ్రీనివాస్, చంద్రశేఖర రాజు, పీహెచ్‌ఎన్ అనంత లక్ష్మీ, సూపర్‌వైజర్ సైదయ్య, ఎంఎల్‌హెచ్‌పీ రవీందర్, ఏఎన్ఎంలు సుజాత, నసీమా, శారద, లక్ష్మి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లక్ష్మీనరసింహ స్వామికి సువర్ణ పుష్పార్చన



ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, మార్చి 29: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి సువర్ణపుష్పార్చన, ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమ శాస్త్రరీతిలో వేడుకలు నిర్వహించిన ఆచార్యులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణం, సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ ఆలయం శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో ముగ్ధమనోహరంగా అలంకరించి, సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలోని ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్యాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళనీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 43,54,195 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

40లీటర్ల సారా స్వాధీనం: ముగ్గురి అరెస్టు

హుజూర్‌నగర్, మార్చి 29: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, జిల్లా ఎక్సైజ్ అధికారులు సంయుక్తగా శుక్రవారం నియోజకవర్గంలోని మఠంపల్లి, పాలకవీడు మండలాల్లో తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో 40 లీటర్ల సారా, 40 కిలోల బెల్లం, గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని బీల్యాయక్‌తండాకు చెందిన ధరావత్ సేవ్యా, పీకీ, సక్రీలను అరెస్టు చేశారు. మఠంపల్లి మండలంలో బీల్యానాయక్‌తండా, పాతతండా, దొనబండతండా, కొత్తతండా, లాలితండా మచ్చాతండా, మీగడంపాడు తండాల్లో తనిఖీలు చేశారు. పాలకవీడు మండలం బెట్టితండాలో 800లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, రాజేష్, మల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

తాళ్లసింగారం గ్రామంలో వ్యక్తి అదృశ్యం

నూతన్‌కల్, మార్చి29: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన పీస్రి నాగయ్య అదృశ్యమయ్యాయు. ఎస్‌ఐ జూకురు సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల ఐదో తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లిన నాగయ్య తిరిగిరాలేదు. నాగయ్య తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అయన ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

చిన్నఅడిశర్లపల్లిలో...



కొండమల్లేపల్లి, మార్చి 29 : వ్యక్తి అదృశ్యమైన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన కంచర్ల ప్రభాకర్‌రెడ్డి కుమారుడు మధుకర్‌రెడ్డి(35) ఈనెల 13వ తేదీన తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుమారుడి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ ధనుంజయ గౌడ్ సెల్ 8712670157, ఎస్‌ఐ రామ్మూర్తి సెల్ 8712670226లకు సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

అనంతగిరి, మార్చి 29: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కారు డ్రైవర్ చినసంగు అఖిలాష్ తన కారుని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఖమ్మం వైపు నుంచి కోదాడకు వెళుతున్నాడు. ఈ క్రమంలో అనంతగిరి మండలంలో తమ్మబండపాలెం గ్రామ శివారులో ముందు వెళుతున్న ఆటోను ఓవర్ టేక్ చేయబోయిఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. అదే సమయంలో ఆటోకు కూడా టక్కర్ ఇచ్చాడు. ఈ ఘటనలో ఆటో నడుపుతున్న ఓర్సు మహేష్, మోటార్ సైకిల్ నడుపుతున్న సత్యంలకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ మహేష్ తండ్రి ఓర్సు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చందుపట్ల గ్రామంలో గీత కార్మికుడికి..

చివ్వెంల: తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో గీత కార్మికుడికి గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా చివ్వెంల మండలం చందుపట్ల గ్రామానికి చెందిన సిగ తిరుపతయ్య శుక్రవారం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో కింద పడడంతో స్వల్పగాయా లయ్యాయి. ఆయనను స్థానికులు 108అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

భూతగాదా కేసులో ఇద్దరి అరెస్టు

తిరుమలగిరి, మార్చి 29: తిరుమలగిరిలో భూతగాదా కేసులో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని మోత్కూరు రోడ్డులో నివసించే వీరవెల్లి కృష్ణాంజలి భర్త కృష్ణమూర్తిలకు చెందిన 20గుంటల భూమిని 2022 సంవత్సరంలో తిరుమలగిరి చెందిన ఇమ్మడి సోమనర్సయ్య తన అనుచరులతో చంపుతామని బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. ఈ కేసులో నిందితులైన తాడోజు శ్రీకాంతాచారి, పత్తేపురం విజయ్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

తెలుగు భాష ఉన్నంత కాలం పద్యం సజీవం



కోమటి మధుసూదన్ రచించిన మధుర గీతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నల్లగొండ కల్చరల్, మార్చి 29 : పద్యం తెలుగువారి సొత్తు అని, తెలుగు భాష ఉన్నంతకాలం పద్యం సజీవంగా జీవిస్తుందని ప్రముఖ సాహితీవేత్త గంట జలేందర్‌రెడ్డి అన్నారు. సృజన సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రచయిత కోమటి మధుసూదన్ రచించిన మధురగీతి ఖండకావ్య పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా మధుసూదన్ పద్య రచనలో విశిష్ట కృషి చేస్తున్నారని అన్నారు. పద్యం రసానుభూతిని కలిగిస్తుందన్నారు. డాక్టర్ ఎం పురుషోత్తమాచార్యలు మాట్లాడుతూ పద్య నిర్మాణంలో మధుసూదన్ చక్కని నైపుణ్యం ప్రదర్శించారని కొనియాడారు. ప్రముఖ అష్టావధాని అవుసుల భానుప్రకాష్ పుస్తక సమీక్షపై మాట్లాడుతూ వస్తు వైవిధ్యంతో కూడిన ఖండకావ్య సంపుటి తెలుగు సాహిత్యానికి ఒక గొప్ప చేర్పువంటిదన్నారు. సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు పెరమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, సాగర్ల సత్తయ్య, బీ రాములు, సోమయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకన్న, ప్రవీణకుమారి, మాదగాని శంకరయ్య, బండారు శంకర్, పున్న అంజయ్య, జ్ఞానేశ్వరాచారి, మల్లిఖార్జునచారి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సొమ్మును కాజేసిన ఉద్యోగి

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు

నాగార్జునసాగర్, మార్చి 29: ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి ఖాతాదారుల సొమ్మును సొంతానికి వాడుకున్న బ్యాంక్ ఉద్యోగిని శుక్రవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నాగార్జునసాగర్ సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి (సాగర్) మండలంలోని జానారెడ్డి కాలనీకి చెందిన కేతావత్ గిరీష్ నాగార్జున సాగర్ హిల్‌కాలనీలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ)లో ఐదేళ్లుగా ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఖాతాదారులు జమచేసిన రూ.6.57లక్షలను లెక్క చూపకుండా తన సొంతానికి వాడుకున్నాడు. దీంతో గత డిసెంబరు 16వ తేదీన బ్యాంక్ ఉన్నతాధికారులు సదరు ఉద్యోగిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఫీల్డ్ ఆఫీసర్ వద్ద ఖాతాదారుల సొమ్మును డిసెంబర్‌లోనే రికవరీ చేశారు. బ్యాంకు ఉన్నతాధికారులు ఫీల్డ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయగా, నాటి నుంచి పరారీలో ఉన్నాడు. గత మూడు నెలలుగా పరారీలో ఉన్న గిరీష్‌ను శుక్రవారం ఉదయం జానారెడ్డి కాలనీలో, ఆయన నివాసంలో అరెస్ట్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి తనకున్న కొంత భూమిని విక్రయించడంతోపాటు స్నేహితుల వద్ద అప్పుగా తెచ్చిన మొత్తం రూ.40లక్షలు బెట్టింగ్‌లో పోగొట్టుకున్నట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. తన సొమ్మంతా మహాదేవా యాప్, డాపెల్, రమ్మి కల్చర్, గాలిబెట్ వంటి బెట్టింగ్‌లో పోగొట్టుకున్నానని నిందితుడు పేర్కొన్నాడు. సదరు ఉద్యోగిని శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ వివరించారు. కేసు చేధించటంలో ప్రతిభ కనబర్చిన ఎస్‌ఐ సంపత్, హెడ్‌కానిస్టేబుల్ గురునాథం, జావీద్, హోంగార్డులు రామ్మోహన్, నర్సింహ, విజయ్, ప్రభులను సీఐ అభినందించారు.



నాగార్జునసాగర్‌లో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న

గోధుమపిండితో శివలింగం



గోధుమ పిండితో తయారు చేసి అలంకరించిన అమరావతి శివలింగాన్ని పోలిన శివలింగం

మోత్కూరు, మార్చి 29: మోత్కూరులో శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అర్చకుడు పారునంది లక్ష్మణమూర్తి శర్మ శుక్రవారం అమరావతిలో ఉన్న శివలింగాన్ని పోలిన శివలింగాన్ని గోదుమ పిండితో తయారు చేశారు. శివలింగానికి కిరీటం, నెలవంక ఆకారంతో అలంకరించి భక్తుల సందర్శనార్థం పెద్దమ్మ తల్లి ఆలయం ఆవరణలో ఉంచారు. పలువురు భక్తులు శివలింగాన్ని దర్శించుకుని పూజలు చేయిస్తున్నారు. ఈ శివలింగాన్ని దర్శించుకున్న వారికి ఆయురారోగ్యాలు కలుగుతాయని అర్చకుడు పీఎల్‌శర్మ తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

గుండాల, మార్చి 29: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యచేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం నూనేగూడెం గ్రామానికి చెందిన తీరుపల్లి యాదిరెడ్డి (41) ఈనెల 23వ తేదీన తన వ్యవసాయ బావి వద్ద మద్యం మత్తులు క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఇరుగుపొరుగు రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాకన్న తెలిపారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం




ముక్తాపూర్‌లో చెన్నకేశవస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 29: పట్టణంలోని ముక్తాపూర్‌కు చెందిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవాలయం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై పురవీధుల గుండా తాళమేళ, మృదంగ, మంగళ వాయిద్యాలతో భక్తిరస విన్యాసాలతో, కోలాట ప్రదర్శనలతో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, పద్మశాలి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తడక రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు దారెడ్డి మంజుల వేణుగోపాల్ రెడ్డి, కొంగరి కృష్ణ, ఆలయం చైర్మన్ నరసింహయాదవ్, నాయకులు బండారు ప్రకాష్‌రెడ్డి, మునుకుంట్ల బాల్‌చంద్రంగౌడ్, గుండ్ల హరిశంకర్‌గౌడ్, సిద్దగోని రాజమల్లేష్‌గౌడ్, కొండమడుగు ఎల్లస్వామి, సప్పిడి చంద్రశేఖర్‌రెడ్డి రాజు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాలో 63వేల పశువులకు టీకాలు

భానుపురి, మార్చి 29: సూర్యాపేట జిల్లా 63వేల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీఏ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం సూర్యాపేటలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాల్లో ఇప్పటివరకు 63వేల పశువులకు టీకాలు వేశామన్నారు. లక్షకు పైగా పశువులకు టీకాలు వేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

వర్ధమాన రాజకీయాలు అవినీతిమయం


బైక్‌పై ప్రచారం చేస్తున్న సదానందరెడ్డి

చండూరు, మార్చి 29 : వర్ధమానరాజకీయాలు అవినీతికి నిలయమై, అత్యంత దారుణంగా దిగజారిపోయాయని వీఆర్‌ఎస్ తీసుకున్న అడిషనల్ డీసీపీ, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపకుడు వీ సదాశివానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చండూరులో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కాం, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి అంశాలను మరిన్ని వెలికితీయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో తమ పార్టీ అభ్యర్థిగా తాను బరిలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో బైక్‌పై ప్రచారం చేస్తున్నానని తెలిపారు. అవినీతి రహిత, శాంతియుత పారదర్శకత పాలన అందించడమే తమ పార్టీ లక్ష్యమన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలి


కేంద్ర బలగాల కవాతులో పాల్గొన్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, మార్చి 29 : ప్రజలంతా ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. శుక్రవారం చిట్యాలలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐలు సైదాబాబు, లింగయ్య, అంతిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట


వెల్మకన్నెలో ఇఫ్తార్‌విందులో పాల్గొన్న కైలాష్‌నేత

గట్టుప్పల్, మార్చి 29 : ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పున్నా కైలాష్‌నేత అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్మకన్నె, కాశీవారిగూడెం గ్రామాల్లో రంజాన్ పండుగ సందర్భంగా రావుల పర్వతాలు, మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింల అభివృద్ధి కోసం పనిచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. మతోన్మాద బీజేపీని, అవినీతి బీఆర్ఎస్‌లను ఓడించాలన్నారు. కార్యక్రమంలో షేక్‌నూర్ మహమ్మద్, సైదులు, అబ్దుల్, హైదర్, రంగారెడ్డి పాల్గొన్నారు.

కనగల్ : స్థానిక కనగల్ ఎక్స్‌రోడ్డులోని మసీద్‌లో నల్లగొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కరీంముల్లా ముస్లింలకు ఇఫ్తార్‌విందును ఏర్పాటుచేశారు. అంతకు ముందు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింగ్‌శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునీతాకృష్ణయ్యగౌడ్, మాజీ సర్పంచ్ సింగం పెద్దులు, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్‌అలీ, నాయకులు హఫీజుద్దీన్, ఇబ్రహీం, అక్రమ్, జానీపాషా, అస్లాం, లతీఫ్, జానీ, హాజీ, ఖాజా తదితరులున్నారు.

పెట్రోలియం డీలర్లకు కమీషన్ పెంచాలి



కమీషన్ పెంచాలని నకిరేకల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డీలర్లు

నల్లగొండ, మార్చి 29 : ఏడేళ్లుగా పెట్రోల్, డీజిల్‌పై డీలర్లకు కమీషన్ పెంచకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే కమీషన్ పెంచాలని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లో చీమలగడ్డ పెంట్రోల్ బంక్‌లో శుక్రవారం జిల్లా పెట్రోల్‌బంక్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు రెట్టింపు, పెట్రోల్, డీజిల్ పెట్టుబడులు రెట్టింపు, బంక్‌లో పనిచేసే వారికి జీతాలు పెరిగాయని అలాగే పెట్రోల్ బంక్ నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగి డీలర్లు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పెట్రోల్ డీజిల్‌పై కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్వకుంట్ల విజయ్‌కుమార్‌రావు, మిట్ట పూర్ణచందర్‌రెడ్డి, జయం శ్రీనివాస్, వేమవరపు నర్సింహులు , బడుగుల నరేందర్, గజ్జెల శ్రీనివాస్, భాస్కర్, విజయలక్ష్మి, నాగయ్యయాదవ్, విక్రమ్, శివ, ఆకుల నాగయ్య, రమేష్, బుద్దా నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, రామ్మోహన్, సుధీర్‌కుమార్, సునిల్, లక్ష్మారెడ్డి, నరేష్, బీరవోలు వెంకట్‌రెడ్డి, షేక్ సైదా, వేణు, లక్ష్మీనర్సయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం లేదు


ఫిర్యాదుపత్రాన్ని చూపుతున్న బాధితులు

మిర్యాలగూడ, మార్చి 29 : హోలీ పండుగ రోజు తనపై దాడి చేసి గాయపరిస్తే ఇంతవరకు రూరల్ పోలీసులు చర్యలు తీసుకోకపోగా కనీసం ఫిర్యాదునైనా తీసుకోవడం లేదని ధనావత్ జ్యోతి(30) ఆరోపించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 25న మండలంలోని కొత్తసామ్యతండాలో హోలీ పండుగ జరుపుకుని యాటను కోసుకోవడం జరిగిందని వాటాల విషయంలో తగాదాకు దిగి దానవత్ చందూ, దానవత్ సైదా, దానవత్ కుమార్, దానవత్ వనిత తనపై దాడి చేసి గాయపరిచారని తెలిపింది. టీఎస్ 08యూబీ 2893 నెంబర్‌గల కారులో నలుగురు, మోటారువెహికల్స్‌పై మరో నలుగురైదుగురు వచ్చి తనను, భర్త బాలు, బావలు దానావత్ కుర్వా, దానావత్ సురేష్‌లపై రాళ్ల కర్రలతో దాడి చేసినట్లు తెలిపారు. తాము గట్టిగా అరవడంతో కారు అక్కడే వదిలివేసి పరారయ్యారని చెప్పారు. తమపై దాడి చేసి గాయపరిచిన వారిపై చర్య తీసుకోవాలని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీసులు ఫిర్యాదు తీసుకోకుండా నాలుగు రోజుల నుంచి తిప్పించుకుంటున్నారని ఆరోపించింది. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అప్పటికీ స్పందించకపోతే రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు పాల్పడతామన్నారు. సమావేశంలో దానావత్ సైదా, మంగా, కొత్తసామ్యతండా మాజీ సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జ్యోతి ఆరోపణలపై రూరల్ ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ఆమె నుంచి ఫిర్యాదు తీసుకున్నామన్నారు. ఘటనలో ఇరువర్గాల తప్పు ఉందని, రేపు ఇరువర్గాలను పిలిచి విచారిస్తామన్నారు. అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మోదీ మూడోసారి ప్రధానికావడం ఖాయం

మాడ్గులపల్లి, మార్చి 29 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నరసింహా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయన్నారు. గ్రామంలో బూత్ స్థాయి నుంచి ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయన వెంట వెంకట్‌రెడ్డి, జాన్‌రెడ్డి, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధిలో టీడీపీది ఎనలేని కృషి


నల్లగొండ, మిర్యాలగూడ, చండూరుల్లోని టీడీపీ కార్యాలయాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ, మార్చి 29 : తెలంగాణ అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ కృషి ఎనలేనిదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల మధుసూదన్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎల్వీ యాదవ్ అన్నారు. టీడీపీ 42వ ఆవిర్భావ రోజు పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్‌ను కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ ఆవిర్భవించిందన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్‌టీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మండవ వెంకటేశ్వర్లు గౌడ్, పట్టణ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు ధీరావత్ మాన్యానాయక్, పార్లమెంట్ అధికార ప్రతినిధి కూరెళ్ల విజయ్‌కుమార్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆకునూరి సత్యనారాయణ, ఎంకేఐ సిద్ధిక్, నర్సింహారావు, నాగయ్య, నాగరాజు, తేలన రవి, వెంకటయ్య పాల్గొన్నారు.

చండూరు: రాజకీయ పార్టీలు వ్యాపార సంస్థలుగా మారాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. చండూరులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో టీడీపీకి పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎర్రజెల్ల లింగయ్య, నాయకులు మక్కెన అప్పారావు, ఎండీ షరీఫ్, గంట అంజయ్య, తోకల యాదయ్య, బోడ బిక్షం, కర్నాటి యాదగిరి, సైదులు పాల్గొన్నారు.

దేవరకొండ : దేవరకొండలో ఎన్టీఆర్ చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జి వస్కుల కృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గార్లపాటి శ్రీను, కోటి అమరేందర్ రెడ్డి, బ్రహ్మచారి, సుమన్, కృష్ణ, శీను, చింతల వాసు, మల్లిఖార్జున్, రాజేష్, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

హాలియా : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో టీడీపీ జెండాను టీడీపీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్ ఆవిష్కరించి, పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మందా తిరుపతి, సబ్బు బలరాంరెడ్డి, కంచర్ల వెంకన్న, కుమురుకోటి వెంకన్న, దాసరి సైదులు, కూరాకుల శ్రీనివాస్, నర్రా పాపయ్య, కర్నె రమణారెడ్డి, గడ్డికుంటా బిక్షం, రావిళ్ల భాస్కర్, ఎల్లయ్య, ఏసు,కనకరాజు శ్రీనివాస్, బొడ్డుకిరణ్, వేముల రామస్వామి, ముజ్జా రవి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రజలకు రాజకీయాలను దగ్గర చేసింది టీడీపీ అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, నసీరుద్దీన్‌బాబా, అనంతరాములు, వెంకన్న, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కాంతాచారి, వెంకటరెడ్డి, నవీన్, నగేష్, శోభన్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడులో టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో నాయకులు మక్కెన అప్పారావు, పొడపంగి సైదులు, గిరిధర్, సత్తయ్య, పందుల నర్సింహ్మ, ఇటుకలపాటి ఆరోగ్యం, రవీందర్, శ్రీశైలం, సైదులు, ధన్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

శాంతి మార్గాన్ని ఆచరించి చూపిన ఏసు


కేతేపల్లిలో సిలువ మోస్తున్న ఫాదర్ బాలశౌరి, నల్లగొండలో సిలువ మోస్తున్న క్రీస్తు ప్రదర్శన

నల్లగొండ కల్చరల్, మార్చి 29 : మానవాళి రక్షణకు అనేక శ్రమలను అనుభవించి శాంతి, ప్రేమ, దయా మార్గాలను ఆచరించి చూపిన దైవకుమారుడు ఏసుప్రభు అని పలువురు పాస్టర్లు అన్నారు. భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను శుక్రవారం నిర్వహించారు. చర్చిలన్నీ భక్తుల దైవప్రార్థనలతో మార్మోగాయి. నాటికలు, పాటలు వంటి వాటితో సాగాయి. ఏసుక్రీస్తు శిలువపై పడిన కష్టాలు, శిలువపై పలికిన ఏడు మాటలను పాస్టర్స్ తమ సందేశంలో వివరించారు. ఏసుక్రీస్తు శిలువ మోసిన సన్నివేశాన్ని క్రైస్తవ భక్తులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శన భక్తులను కంటతడి పెట్టించే విధంగా సాగింది. పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆయా చర్చిలకు హాజరై మాట్లాడారు. 40 రోజులు ఉపవాస దీక్షలు చేసిన భక్తులు ప్రార్థనల అనంతరం దీక్షలను విరమించారు. సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు క్రిస్టఫర్, అబ్షలోం, చిత్తరంజన్‌దాస్, టీఎస్ విలియమ్స్ పాల్గొన్నారు. మిర్యాలగూడ రోడ్డులోని గెరిజీఎంకొండ ప్రార్థనా మందిరంలో పాస్టర్ జేకబ్ ఏసు సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో బ్రదర్స్ మలాకీ, లక్ష్మయ్య, సంజీవయ్య, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. దేవరకొండ రోడ్డులోని మరియరాణి చర్చిలో శిలువ మోసిన సన్నివేశం భక్తులను కంటతడి పెట్టించింది. కార్యక్రమంలో బిషప్, పాస్టర్స్, సిస్టర్స్, చర్చి పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

రేపు ఈస్టర్ పండుగ..

ఏసుక్రీస్తు సిలువపై మరణించి శుక్రవారం సమాధి అయ్యారు. తిరిగి మూడో రోజైన ఆదివారం సమాధి నుంచి ఏసుక్రీస్తు తిరిగి లేచిన రోజు కావటంతో ఆ రోజున ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. చర్చిలన్నింటిలో ఆదివారం దైవ కుమారుడు తిరిగి లేచాడని, ఆ సువార్తను అందరికీ అందించే వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు.

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఇనుపాముల, రాయపురం, కేతేపల్లి, భీమారం, చెరుకుపల్లి, కొప్పోలు, తుంగతుర్తి గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏసు సిలువ మోసిన సంఘటనలను స్ఫురింపజేస్తూ ఊరేగింపులు జరిపారు. కేతేపల్లిలోని జపమాల మాత చర్చి ఫాదర్ బాలశౌరి సిలువ మోస్తూ సిలువ మార్గంలో ప్రార్థనలు జరిపారు. రాయపురంలో చర్చిలో ప్రార్థనలు, కార్యక్రమాలు నిర్వహించారు.

మర్రిగూడ : మర్రిగూడ ఎడ్యూనైజర్ మందిరం, సీయోన్ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజులు ఉపవాసం ఉన్న భక్తులు మందిరాలకు వెళ్లి ఉపవాస దీక్ష విరమించారు. కార్యక్రమంలో పాస్టర్స్ పోలిశెట్టి ప్రకాశ్, ఈద అబ్రహాం, లపంగి నర్సింహ, ముద్దం శ్రీనివాస్, లపంగి రవి, నర్సింహ, సాయి, రాములు, సుగుణమ్మ, హైమావతి, జంగమ్మ ఉన్నారు.


మర్రిగూడలో ఎడ్యూనైజర్ మందిరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హాలియా, మార్చి 29 : హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియా సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ అన్నారం ఫీడర్ మార్గంలో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో అనుముల, ఈశ్వర్‌నగర్, ఇబ్రహీంపేట, పాలెం, రామడుగు ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

మిర్యాలగూడ మండలంలోనూ..

మిర్యాలగూడ రూరల్ : విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో శనివారం మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ అమర్‌సింగ్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు 33కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి సబ్‌స్టేషన్ల పరిధిలోని చిల్లాపురం, చిల్లాపురంతండా, శాంతినగర్, ఐలాపురం, కుంటకిందితండా, వాటర్‌ట్యాంక్‌తండా, నందిపాడు, రవీంద్రనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా గంధోత్సవం

డిండి, మార్చి 29: మండల కేంద్రంలోని హజరత్ ఖాజేయే ఖాజుగా ఖాజా మైనొద్దీన్, హజరత్ ఖాజా సయ్యద్‌షా అమీరొద్దిన్ దర్గా 75వ ఉర్సు గంధోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు దర్గా కమిటీ ఇఫ్తార్‌విందును ఏర్పాటుచేసింది. కార్యక్రమంలో సయ్యద్‌షా షరీఫుద్దీన్, సైదులు, చాంద్‌పాషా, శ్రీధర్, చంద్రయ్య, బాబా, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, నారయ్య, కర్ణాకర్‌రెడ్డి, గంగాధర్, యాదగిరి పాల్గొన్నారు.

అవిశ్వాసాలు నెగ్గేనా? వీగేనా?

● నేడు పెద్దఅడిశర్లపల్లి, మర్రిగూడ ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 29 : ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డిపై శనివారం అవిశ్వాస తీర్మాన సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఏంజరుగుతుందోనన్న చర్చ అధికార, విపక్ష పార్టీల ముఖ్య నాయకుల్లో నెలకొంది. దీంతో మండల రాజకీయం ఆసక్తిగా మారింది. అవిశ్వాసం నెగ్గుతుందా, వీగుతుందా? అన్న చర్చ సాగుతోంది. వీగిపోయేలా చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధం కాగా ఎలాగైనా నెగ్గించుకోవాలని హస్తం నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాస తీర్మానంపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి శ్రీరాములు తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో 14 ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. 2020 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 10 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు గెలుపొందారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆరుగురు ఎంపీటీసీలు ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆ పార్టీ ఎంపీటీసీల బలం 10కి చేరింది. దీంతో వీరందరూ కలిసి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చారు. అయితే ఎంపీపీ కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల ఎంపీపీలపై అవిశ్వాసం పెట్టుకోవచ్చు అని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో శనివారం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో క్యాంప్‌లోకి వెళ్లిన కాంగ్రెస్ పార్టీలోని 10 ఎంపీటీసీల్లో నుంచి ముగ్గురిని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి రాత్రికి రాత్రి తమ శిబిరానికి తరలించారు. దీంతో కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 7 సమానంగా ఎంపీటీసీలు కలిగి ఉన్నారు. అవిశ్వాస తీర్మానంలో మొత్తం 14 మంది ఎంపీటీసీలకు తీర్మానం పెట్టాలంటే కనీసం 9 మంది ఎంపీటీసీలు హాజరుకావాలి. దీంతో బీఆర్ఎస్ క్యాంప్‌లోకి వెళ్లిన ఇద్దరు కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు తిరిగి వచ్చి కాంగ్రెస్ అనుకులంగా చేతులు ఎత్తుతారా లేదా అవిశ్వాసం వీగిపోయేలా.. వారు రాకుండా ఉంటారా అన్న చర్చ సాగుతోంది. 9 మంది కంటే ఒక్కరు తక్కువగా ఉన్నా అవిశ్వాసం వీగిపోతుంది. ఈ లెక్కలు వేసుకున్న అధికార, ప్రతిపక్ష నాయకులు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

మర్రిగూడ ఎంపీపీపైనా..

మర్రిగూడ, మార్చి 29 : మర్రిగూడ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఎంపీపీపై సొంత పార్టీకి చెందిన బీఆర్ఎస్ సభ్యులే అసమ్మతివర్గంగా ఏర్పడి అవిశ్వాసతీర్మానం కోసం చండూరు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆర్డీవో అవిశ్వాస తీర్మానం ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీలకు నోటీస్ జారీ చేశారు. అయితే 11 మంది ఎంపీటీసీలు ఉండగా ఐదుగురు అసమ్మతి వర్గమైన తిరుగండ్లపల్లి ఎంపీటీసీ గండికోట రాజమణిహరికృష్ణ వైపు ఉండగా మరో ముగ్గురు ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి వైపు ఉన్నారు. మిగిలిన ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఉన్నారు. అయితే ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఎవరికి మద్దతు ఇస్తే వారే ఎంపీపీగా గెలిచే అవకాశం ఉంది.



దేవరకొండ: దేవరకొండ పట్టణంతో పాటు గ్రామాల్లోనూ బెల్ట్‌షాపులు నిర్వహిస్తే దాడులు జరిపి కఠినచర్యలు తీసుకుంటామని సీఐ నర్సింహులు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇసుక రవాణాకు పాల్పడితే కేసులు తప్పవన్నారు.

వేములపల్లి: ఆమనగల్లు గ్రామ శ్రీపార్వతీరామ లింగేశ్వరస్వామి జాతరలో భారీ బందోబస్తు నిర్వహించిన ఎస్ఐ విజయ్‌కుమార్‌ను ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు సన్మానించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు లొండ కలమ్మ, పెరుమాళ్ల జోజి, కొండ వెంకన్న, వాకిట భిక్షం, ముత్యాల యుగంధర్, పిల్లల సందీప్, పత్తిపాటి నవాబ్, అవిరెండ్ల సతీష్, పెరుమాళ్ల జోజి, ఎల్లయ్య, లింగారెడ్డి, కృష్ణయ్య, సతీష్, గంగయ్య, శంకర్ ఉన్నారు.

గుర్రంపోడు: కొప్పోలు గ్రామంలో ఏప్రిల్ 15న సీతారామచంద్ర స్వామి దేవాలయ శిఖర ప్రతిష్ఠ, బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీపార్వతీదేవి, నందీశ్వర విగ్రహ, యంత్ర ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు దేవాలయంలో కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆవుల వెంకన్న, మాజీ సర్పంచ్ తిరుగుడు లింగారెడ్డి, అయితగోని శంకర్‌గౌడ్, నగేష్‌గౌడ్, శ్రీనివాస్, సురేష్, రవికుమార్, వెంకన్న పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణ శివారు పెంచికల్‌పహడ్ వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఎర్ర అంజనేయులు విద్యుత్ ఏడీఏ సైదులును కలిసి వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా విద్యుత్ సౌకర్యం కల్పించలేదన్నారు.

మునుగోడు : కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సురిగి నర్సింహతో పాటు పలువురు ముఖ్యనేతలు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదక పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మునుగోడు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

హాలియా: అనుముల గ్రామానికి చెందిన దేవులపల్లి రజిని ఇటీవల మృతి చెందింది. ఆమెతో చదువుకున్న పదో తరగతి స్నేహితులు ఆమె కుటుంబసభ్యులకు రూ.50వేలు ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సైదులు, సైదులు, సతీష్, భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లిలో గ్రామదేవతల ఆలయాల నిర్మాణానికి వేముల ఎల్లయ్యగౌడ్, పుష్పమ్మ దంపతులు, అలుగుబెల్లి వివేకానందరెడ్డి లక్షా116 రూపాయలు చొప్పున విరాళంగా అందజేసినట్లు నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఐతారాజు యాదయ్య, వేముల సత్తయ్య, రాధారపు బిక్షపతి, లింగాల రాములు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : శ్రీరామనవమిని పురస్కరించుకొని కొండమల్లేపల్లిలోని సీతారామంజనేయస్వామి దేవాలయంలో నూతన ఉత్సవ కమిటీని దేవాలయ మాజీ కార్యదర్శి నీలా లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సభ్యులుగా పస్నూరి యుగేందర్‌రెడ్డి, మైల బుచ్చిరెడ్డి, నీల లక్ష్మయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మారం రవీందర్‌రెడ్డి, నాయిని సుభాష్‌రెడ్డి, నాయిని రమేశ్‌రెడ్డి,బూడిద ప్రభాకర్‌రెడ్డి, దాచేపల్లి నరేందర్, తోటపల్లి కిరణ్ పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి

మిర్యాలగూడ టౌన్, మార్చి 29: దేశభక్తి పెంపొందించుకోవాలని వీహెచ్‌పీ జిల్లా మాతృశక్తి జిల్లా సంయోజకులు సత్యవతి కోరారు. పట్టణంలోని ఎస్పీఆర్ స్కూల్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు భగవద్గీత పఠించేలా చూడాలని, మహాభారతం, రామాయణ గాథలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, శాలివాహన పండరీనాథ్, గంజి సుధాకర్, నీలిమారెడ్డి, శ్రీవాణి, పద్మ, రాంకుమార్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసిన కిరణ్‌కుమార్‌రెడ్డి


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసిన కిరణ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 29: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

బీసి కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా పాలకూరి

నల్లగొండ, మార్చి 29 : బీసి కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన పాలకూరి రవిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహయాదవ్ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ బీసీ కులాలను ఏకతాటిపైకి తెచ్చి సంఘ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

చెన్నైలో ఉగాది వేడుకలకు బాల్‌రెడ్డికి ఆహ్వానం

నార్కట్‌పల్లి, మార్చి 29 : తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించే ఉగాది వేడుకలకు మండలంలోని నక్కలపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, పుడమి సాహితీవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఉగాది సందర్భంగా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చెన్నైలో నిర్వహించే వేడుకల్లో పంచాంగ పఠనం, కవి సమ్మేళనం, పుస్తకావిష్కరణ కార్యక్రమాలకు ఆయన్ను ఆహ్వానించారు.

'గాదరి కిషోర్ క్షమాపణ చెప్పాలి'

హాలియా, మార్చి 29: మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హాలియాలోని యువజన కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి అతడి కుమారులపై ఎలాంటి మచ్చలేదని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్లలోనే కిషోర్ ఎన్నోదందాలు, అరాచకాలు చేశాడన్నారు. తక్షణమే కిషోర్ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, రంగారెడ్డి, నకిరేకంటి సైదులు, అజ్జు, నర్సింహా, రాజశేఖర్, నాగరాజు, మహేష్, శ్రీకాంత్, సాగర్, వినోద్ పాల్గొన్నారు.